క్లుప్తంగా

పోతులూరు సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

ప్రత్తిపాడు: మండలంలోని పోతులూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. గ్రామ సర్పంచ్ బొండు రాంబాబు పంచాయతీ నిధులు పక్కదోవ పట్టించి, అనేక అవకతవకలకు పాల్పడుతున్నారని అదే గ్రామానికి చెందిన బర్ల చక్రం, పంచాది వీరవెంకట సూర్యానారాయణ ఏప్రిల్ 21న కాకినాడలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పెద్దాపురం డివిజనల్ పంచాయతీ అధికారి విచారణ చేపట్టి, జూన్ 9న నివేదికను జిల్లా పంచాయతీ అధికారికి అందజేశారు. సర్పంచ్‌కు ఇచ్చిన షోకాజ్ నోటీసుకు సంజాయిషీ సమర్పించకపోవడం, పంచాయతీ నిధులు దుర్వినియోగం జరగడంతో అతని చెక్ పవర్ రద్దు చేశారు. గ్రామ పంచాయతీ నిధులు డ్రా చేసే అధికారాన్ని డిప్యూటీ మండల పరిషత్ అధికారికి బదలాయిస్తున్నట్టు వి.రవికుమార్ తెలిపారు.

రహదారి సౌకర్యం కల్పించాలని వినతి

గోకవరం: గత ప్రభుత్వంలో మూడు సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన జగనన్న కాలనీకి రహదారి సౌకర్యం కల్పించాలని మండలంలోని వెదురుపాక, బావాజీపేట గ్రామాలకు చెందిన మహిళలు కోరారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో జేసీ చినరాయుడుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకుడు దాసరి విష్ణు మాట్లాడుతూ జగనన్న కాలనీలో సుమారు 500 మంది ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నారన్నారు. కాలనీకి పోలవరం కాలువ గట్టు వైపు నుంచి వెళ్లాలంటే సుమారు కిలోమీటర్ వెళ్లాల్సి ఉంటుందని, సమీపంలో మరో మార్గం నుంచి వెళుతుంటే పూర్వపు భూ యజమానులు అడ్డగిస్తున్నారని వాపోయారు. దీనిపై స్పందించి తమకు శాశ్వత రహదారికి చర్యలు చేపట్టాలని కోరారు.

హెల్మెట్ ధారణపై అవగాహన



కోటనందూరులో హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై రామకృష్ణ

కోటనందూరు: స్థానిక చెరకు కాటా వద్ద హెల్మెట్ ధారణపై వాహనదారులకు ఎస్సై రామకృష్ణ సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ హెల్మెట్ ప్రాణరక్షణ కవచమన్నారు. వాహనం నడిపేటప్పుడు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల ఎంతోమంది రోడ్డు ప్రమాదాల్లో విలువైన ప్రాణాలను కోల్పోయారన్నారు. హెల్మెట్ ధారణ తప్పనిసరి అని, ఈ నిబంధన అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

10న మెగా పేరెంట్స్ సమావేశం

తుని: ఈ నెల 10న నిర్వహించే మెగా టీచర్స్, పేరెంట్స్ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎంపీపీ ఎంపీపీ బొప్పన రాము కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంఈవోలు గీతాదేవి, రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గీతాదేవి మాట్లాడుతూ ఈ నెల 10న నిర్వహించే టీచర్స్, పేరెంట్స్ మీటింగ్‌ను విజయవంతం చేయడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలన్నారు. గ్రామ నాయకులు, అధికారులు, పూర్వ విద్యార్థులను ఆహ్వానించి పండగలా జరపాలని సూచించారు. డిప్యూటీ ఎంపీడీవో మరిడయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

తుని: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం జి.జయంతి సూచించారు. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సోమవారం బహుమతులు అందజేశారు. రాజా ఉన్నత పాఠశాల రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు శేషగిరి, యూటీఎఫ్ నాయకులు శివ రామకృష్ణ, గాంధీ, ఎస్.గిరి, ఎస్ఎఫ్ఐ నాయకులు జి.రాము, లోవ రాజు, జోసెఫ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రైతులకు డ్రోన్ల పంపిణీ

గోకవరం: మండలంలోని కొత్తపల్లి, వెదురుపాక గ్రామాలకు చెందిన రైతులకు సబ్సిడీపై మంజూరైన రెండు డ్రోన్లను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సోమవారం పంపిణీ చేశారు. అలాగే రైతులకు నాలుగు క్వింటాళ్ల టీబీజీ 104 మినుములు అందజేశారు. అనంతరం గ్రామంలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పార్టీ నాయకులు గాజింగం సత్తిబాబు, ఏఎంసీ చైర్మన్ అడపా భరత్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పాలూరి బోసుబాబు,ఉన్నారు.

నీరు అందదు..సాగు సాగదు

- తిమ్మరాజుచెరువు ఆయకట్టుకు పూర్తిస్థాయిలో అందని సాగు నీరు
- ఆక్రమణల చెరలో పంట కాలువలు
- అధికారుల సమన్వయ లోపంతో సమస్య
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు



ప్రధాన కాలువలో గేట్లనిమిత్తం నిర్మించిన గోడలు

ఏలేశ్వరం: ఉమ్మడి గొర్రె పుచ్చి చచ్చిందనే సామెతలా మారింది వేలాది ఎకరాలకు సాగునీరు అందించే తిమ్మరాజుచెరువు పంట కాలువల పరిస్థితి. పంట కాలువల మీదుగా చెరువు నుంచి ఏలేశ్వరం , తిరుమాలి, లింగంపర్తి, సిరిపురం, పేరవరం తదితర గ్రామాల్లోని సుమారు 6 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. ఏలేశ్వరం మీదుగా గ్రామాలకు సాగునీరు వెళుతుంది. పట్టణంలో ప్రధాన పంట కాలువ రెండుగా చీలి ఏలేశ్వరం, లింగంపర్తి మీదుగా వేర్వేరుగా గ్రామాలకు నీటిని అందిస్తుంది. లింగంపర్తి వెళ్లే కాలువ పల్లంగా ఉండడంతో మెరకగా ఉండే ఏలేశ్వరం కాలువలోకి నీరువెళ్లని పరిస్థితి నెలకొంది. దీంతో పట్టణంలోని పాతస్టేట్ బ్యాంక్ సమీపంలో రెండుగా చీలే ప్రధాన కాలువ వద్ద గేట్ల నిర్మాణం నిమిత్తం గోడలను నిర్మించారు. గోడలు నిర్మించి ఏళ్లుగా గడుస్తున్నా ఇప్పటివరకూ గేట్ల ఏర్పాటు చేయలేదు. ఏలేశ్వరం ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొంది. దీనిపై అనేక సార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువలు ఆక్రమణలు, చెత్త పేరుకుపోవడంపై ఇరిగేషన్ అధికారులను కలిస్తే ఏలేశ్వరం నగర పంచాయతీ అధికారులను కలవమని చెబుతున్నారు. వారేమో పంట కాలువ మండలపరిధిలో ఉందని మండల పరిషత్ అధికారులను కలవమని మూడు శాఖల అధికారులు



ఏలేశ్వరంలో ఆక్రమణకు గురైన పంటకాలువ

రైతులను ముప్పుతిప్పలు పెడుతున్నారు. రైతులు ఏమి చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. మూడు శాఖల అధికారులు తమ పరిధి కాదంటే తమది కాదని రైతులను ఇబ్బంది



కాలువలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు

పెడుతున్నారు. దీంతో తమ ఆయకట్టుకు నీరందక పంటలను నష్టపోతున్నారు.

అవగాహన లోపంతో..

ప్రస్తుతం ఉన్న ఇరిగేషన్ అధికారులకు పంట కాలువలపై అవగాహన లేకపోవడం రైతులకు శాపంగా మారింది. ఇటీవల ప్రభుత్వం పంట కాలువలో పూడికతీతకు నిధులు మంజూరు చేసింది. అధికారులు సమస్య ఉన్న చోట కాకుండా రైతులకు ఉపయోగం లేని చోట పూడిక తీయించేందుకు సిద్ధం కాగా రైతులు అడ్డుకున్నారు. కాలువలో ప్రధానంగా సమస్య ఉన్న చోట పూడిక తీస్తే నిధులు సద్వినియోగం అవుతాయని రైతులు పేర్కొంటున్నారు.

అధ్వానంగా పంట కాలువలు

పంట కాలువల్లో చెత్త పేరుకుపోయి అధ్వానంగా మారాయి. కాలువపై సమీపంలోని దుకాణదారులు కల్వర్టులు నిర్మించారు. పూడిక తీత పనులకు ఇవి ఆటంకంగా మారుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో పాటు కాలువలు చాలా వరకు ఆక్రమణలకు గురయ్యాయి. అధికారులు చిత్తశుద్ధితో కాలువలపై ఆక్రమణలు తొలగించి పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

> **పెంటకాలువ కాకుండా చూడాలి**
>
> 
>
> పొలాలకు సాగునీరు అందించే పంట కాలువ పెంట కాలువగా కాకుండా చూడాలి. కాలువలో చెత్త వేయకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి. రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలి. మూడుశాఖల అధికారులు దీనిపై దృష్టి సారించాలి.
>
> – సామంతుల కృష్ణ కిషోర్, నీటి సంఘం అధ్యక్షుడు ఏలేశ్వరం

గిరిబాబును కలసిన వైఎస్సార్ సీపీ నాయకులు



కిర్లంపూడిలో ముద్రగడ గిరిబాబును కలసిన వైఎస్సార్ సీపీ నాయకులు

కిర్లంపూడి: వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబును పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కిర్లంపూడిలోని ఆయన నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని గిరిబాబు సూచించారు. ఆయనను కలిసిన వారిలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, ఎంపీటీసీలు పినిశెట్టి ప్రకాష్, సింద్రపు భాస్కరరావు, మాజీ సర్పంచ్ కోరావు గంగరాజు, యెనుముల దొరబాబు, ఏనుగు పెద్ద తదితరులు ఉన్నారు.

నేడు అన్నసమారాధన

తొండంగి: సంక్షేమ సారథి దివంగత వైఎస్సార్ జయంతి సందర్భంగా మండలంలోని పైడికొండలో మంగళవారం రాత్రి భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మేడిశెట్టి దారబాబు తెలిపారు. గ్రామంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద జయంతి వేడుకలు నిర్వహిస్తామన్నారు. రాత్రికి భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశామన్నారు. మండలంలోని ఎ.కొత్తపల్లి, పెరుమాళ్లపురం, రావికంపాడులో వైఎస్సార్ విగ్రహాల వద్ద జయంతి వేడుకలు నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బత్తుల వీరబాబు తెలిపారు.

రోడ్డు నిర్మాణంలో అలసత్వం తగదు

కిర్లంపూడి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా రాజుపాలెం–రామవరం రోడ్డు నిర్మాణంలో అలసత్వం వహిస్తోందని సామాజిక ఉద్యమకారుడు పాటంశెట్టి సూర్యచంద్ర ధ్వజమెత్తారు. రాజుపాలెం–గోనేడ రోడ్డుపై పడిన భారీ గుంతలను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో రాజుపాలెం–రామవరం రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారన్నారు. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా రహదారి పనులు చేపట్టలేదని ఆరోపించారు. గ్రామస్తులు, వాహనదారులు రోడ్డుపై రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రోడ్డు నిర్మాణం పనులు చేపట్టకపోతే స్థానికులతో కలసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



గోనేడలో రోడ్డు పనులు ప్రారంభించాలని నినాదాలు చేస్తున్న సూర్యచంద్ర, స్థానికులు

తలుపులమ్మకు చీర, సారె సమర్పణ

తుని: ఆషాఢ మాసోత్సవాల్లో భాగంగా కేంద్ర మాజీ మంత్రి, సినీ నటుడు యువీ కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి తలుపులమ్మ వారికి సారె, చీర సమర్పించారు. సోమవారం కుటుంబ సభ్యులతో లోవ దేవస్థానానికి వచ్చిన శ్యామలాదేవికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరిన కోర్కెలు తీర్చే తలుపులమ్మ వారికి సారె సమర్పించడం ఆనందంగా ఉందని శ్యామలాదేవి తెలిపారు. అర్చకులు క్షేత్ర విశిష్టతను వివరించారు. ప్రముఖ హీరో ప్రభాస్ పేరు మీద కుంకుమ పూజలు జరిపించారు. అమ్మవారి శేష వస్త్రంతో సత్కరించి, వేద పండితులు ఆశీర్వచనాలు, అమ్మవారి చిత్రపటం, ఫొటోను అందజేశారు. భక్తులు శ్యామలాదేవితో సెల్ఫీ దిగేందుకు పోటీపడ్డారు. ఆలయంలో అమ్మవారిని దర్శించుకునే వృద్ధులు, దివ్యాంగుల కోసం నిర్మిస్తున్న ఎస్కలేటర్ పనులను చూసి దేవస్థానం ఈవో విశ్వనాథరాజును అభినందించారు.



తలుపులమ్మ అమ్మవారి సన్నిధిలో పండితుల ఆశీస్సులు తీసుకుంటున్న శ్యామలాదేవి

మహిళా చట్టాలపై అవగాహన

కిర్లంపూడి: చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ హెచ్చరించారు. స్థానిక ఎస్సై జి.సతీష్ అధ్యక్షతన తామరాడ ప్రభుత్వ జెడ్పీ హైస్కూల్ ప్లస్–1లోని విద్యార్థులకు మహిళా చట్టాలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. శక్తియాప్ రిజిస్ట్రేషన్, యాంటీ ర్యాగింగ్ యాక్ట్, ఉమెన్ ఎంపవర్మెంట్, పోక్సో చట్టం, క్రైమ్ ఎగైనెస్ట్ ఉమెన్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్థానిక దుకాణాలను సందర్శించి 18 ఏళ్ల లోపు పిల్లలకు సిగరెట్లు, పొగాకు విక్రయిస్తే చర్యలు తప్పవని దుకాణ యజమానులను హెచ్చరించారు. విద్యార్థుల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే జగ్గంపేట సీఐ ఫోన్ నంబర్ 94407 96529, కిర్లంపూడి ఎస్సై ఫోన్ నంబర్ 94409 04834కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

డ్రగ్స్ విక్రయిస్తే సమాచారం ఇవ్వండి

గండేపల్లి: గ్రామాల్లో ఎవరైనా మత్తు పదార్థాలు (డ్రగ్స్) విక్రయిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని స్థానిక సీఐ వైఆర్కే శ్రీనివాస్ కోరారు. మండల పరిధిలోని పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థలకు వంద మీటర్ల లోపు గల పాన్ షాపులు, బడ్డీ షాపుల వద్ద గుట్కా, టొబాకో, గంజాయి వంటి ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తే ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎవరైనా డ్రగ్స్ విక్రయించినా, వినియోగించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



తామరాడలో చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



తునిలో మంద కృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు

తుని: పట్టణంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కొండవారిపేట, వీరవరపుపేట, ఇసుకలపేట, తారకరామనగర్‌లో ఎమ్మార్పీఎస్ జెండాలు ఎగుర వేసి, కేక్ కట్ చేశారు. స్థానిక గొల్లప్పారావు సెంటర్లో పద్మశ్రీ మందకృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. గొల్లప్పారావు సెంటర్ నుంచి ఎల్ఐసీ బిల్డింగ్ వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ముప్పిడి శ్యాంకుమార్, ఆరుగుల సత్తిబాబు, గందం మహేష్, పెదపూడి శివ, శీలి ప్రసాద్ పాల్గొన్నారు.

కోటనందూరు: మండలంలోని కొత్తకొట్టాంలో మాదిగ రక్షణ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆరుగుల మోషే ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు, మహిళలు పార్టీ జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఆరుగుల మోషే మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ గత 30 ఏళ్లగా మాదిగలకు అండగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో మొర్త మాణిక్యం, ఆరుగుల సత్తిబాబు, తుమ్మలపల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: మండలంలోని రామచంద్రపురంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. సర్పంచ్ టి.సాయిగుణశేఖర్, జనసేన జగ్గంపేట కో ఆర్డినేటర్ రమేష్ పాల్గొన్నారు.

రౌతులపూడి: స్థానిక అరుంధతి కమ్యునిటీ హాలు వద్ద సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు కొత్తాల అబ్రహం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మంద కృష్ణ మాదిగకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. గెడ్డం చిన్న శ్రీను, పిల్ల రవికుమార్, చామంద్ర నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

శంఖవరం: స్థానిక మాదిగపేటలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నేతలు జెండాను ఎగరవేసి గౌరవ వందనం చేశారు.

వైఎస్సార్ పాలనలో మెట్టకు మేలు

మాజీ మంత్రి తోట నరసింహం

జగ్గంపేట: మెట్ట ప్రాంతమైన జగ్గంపేట నియోజకవర్గం ప్రస్తుతం సస్యశ్యామలంగా ఉందంటే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన మేలే కారణమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జగ్గంపేట నియోజకవర్గానికి అనేక పథకాలు మంజూరు చేశారని తెలిపారు. ప్రధానంగా పుష్కర ఎత్తిపోతల పథకంలో అదనపు లిఫ్టులు మంజూరు చేయడం వల్ల మెట్ట ప్రాంతంలో నిర్దేశించిన ఆయకట్టు కన్నా అదనంగా మరో 29 వేల ఎకరాలు సాగులోకి వచ్చిందన్నారు. జగ్గంపేటలో డిగ్రీ కాలేజీ, ఫైర్ స్టేషన్, భావవరం పంపింగ్ స్కీమ్ వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే మంజూరు చేశారని తెలిపారు. పుష్కర ఎత్తిపోతల పథకం వల్ల మెట్ట సస్యశ్యామలంగా మారిందన్నారు. మెట్టలో భూముల ధరలకు రెక్కలు వచ్చాయని తెలిపారు.

నిర్లక్ష్యం నీడలో తాళ్లూరు లిఫ్ట్

వైఎస్సార్ హయాంలో నిర్మించిన తాళ్లూరు ఎత్తిపోతల పథకం పనిచేయకపోవడం వల్ల 110 కాంటూర్‌లో ఉండే అనేక గ్రామాలకు సాగునీరు అందడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం తాళ్లూరు లిఫ్ట్‌ను తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలన్నారు. లేకుంటే ఈ ఏడాది ఖరీఫ్‌లో వేలాది ఎకరాల్లో వరిసాగు కష్టంగా మారుతుందని తెలిపారు.



తోట నరసింహం

జగ్గంపేటలో వైఎస్సార్ జయంతి వేడుకలు

జగ్గంపేట బస్టాండ్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద మంగళవారం నిర్వహించే రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని తోట నరసింహం పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటలకు వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి జయంతి వేడుకలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు తోట శ్రీరాంజీ, రామకుర్తి మూర్తి, రావుల గణేష్ రాజా, గిడియాల పెదకాపు, సరకణం అచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

మండల కమిటీ ప్రధాన కార్యదర్శిగా సామ్యూల్‌రాజు

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీ శంఖవరం మండల కమిటీ ప్రధాన కార్యదర్శిగా మాడి సామ్యూల్‌రాజు, కార్యనిర్వాహక సభ్యుడుగా కుక్క సుబ్బారావులను నియమించారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం ప్రకటించారు. వీరి నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

లేబర్ కోడ్‌లు తక్షణమే రద్దు చేయాలి



ప్రత్తిపాడులో బైక్ ర్యాలీని ఉద్దేశించి ప్రసంగిస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శేషుబాబ్జి

ప్రత్తిపాడు: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జి డిమాండ్ చేశారు. ఈ నెల 9న దేశవ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు ఆధ్వర్యంలో వివిధ కార్మిక సంఘాలు సోమవారం సాయంత్రం ప్రత్తిపాడులో బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి అల్లూరి సీతారామరాజు జంక్షన్ మీదుగా లంపకలోవ రహదారిలోని వీరభద్రా రొయ్యల పరిశ్రమ వరకూ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా దువ్వా శేషుబాబ్జి మాట్లాడుతూ ప్రత్తిపాడు పరిసర ప్రాంతాల్లోని పరిశ్రమల్లో స్థానిక యువతకు 75 శాతం ఉద్యోగాలు కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి కార్మికుడికి రోజుకూ రూ.176 ఇస్తే సరిపోతుందని అనడం అన్యాయమన్నారు. కార్మికులకు తక్కువ జీతం ఇవ్వాలని నిర్ణయించినపుడు అసెంబ్లీ, పార్లమెంట్ సభ్యులు లక్షల జీతాలు ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. రాష్ట్ర కేబినెట్ నిర్ణయించిన పని గంటల పెంపుదలను తీవ్రంగా దుయ్యబట్టారు. వెంటనే పని గంటల పెంపుదల నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులందరూ 9న నిర్వహించే మహా ప్రదర్శన, బహిరంగ సభల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు నిట్ల శ్రీను, అల్లాడి లక్ష్మి, వెంకటలక్ష్మి, కె.సతీష్ కుమార్, గనిలక్ష్మి, పోసపల్లి రమణ, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రాంతికి మంత్రి తరహా స్వాగతం

అన్నవరం: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ పద్మనాభం కుమార్తె క్రాంతి ఎమ్మెల్యే కాదు, ఎంపీ కాదు, కనీసం పంచాయతీ వార్డు సభ్యురాలు కూడా కాదు. జనసేనలో సాధారణ సభ్యురాలు. కాగా అన్నవరం దేవస్థానంలో ఆమెకు మంత్రికి ఇచ్చే ప్రోటోకాల్‌కు మించి స్వాగతం పలకడం విమర్శలకు తావిచ్చింది. దేవస్థానం ముఖ్య అధికారి పశ్చిమ రాజగోపురం వద్ద ఆమెకు స్వాగతం పలికి దగ్గరుండి స్వామివారి ఆలయంలో దర్శనం చేయించారు. సాధారణంగా వేదపండితులు ఉదయం 11 గంటలు వరకే ఆలయంలో ఉండి వీఐపీలకు వేదాశీస్సులు అందజేస్తారు. కాగా సోమవారం క్రాంతి పర్యటన పూర్తయ్యే వరకు ఉండాలని ముఖ్య అధికారి ఆదేశించడంతో ఇంటికి వెళ్లేందుకు పశ్చిమ రాజగోపురం వరకు వచ్చిన వేదపండితులు ఆలయానికి వెనుతిరిగి వెళ్లారు. క్రాంతి దర్శనం అయ్యాక ఆశీర్వచనాలు అందచేసిన అనంతరం ఇళ్లకు వెళ్లారు. గతంలో ఎమ్మెల్యే దర్శనానికి వచ్చినా ప్రోటోకాల్ సిబ్బంది మాత్రమే దర్శనం చేయించి ప్రసాదాలు ఇచ్చేవారు. ఇప్పుడు ఏ చిన్న నాయకుడు వచ్చినా ముఖ్య అధికారి వచ్చి స్వాగతం పలకడం విమర్శలకు తావిస్తోంది. కాగా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి తాను పోటీ చేయాలో ? వద్దో ? జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నిర్ణయిస్తారని ముద్రగడ పద్మనాభం కుమార్తె క్రాంతి తెలిపారు. సోమవారం ఆమె కుటుంబ సభ్యులు, సుమారు 50 మంది అనుచరులతో కలసి రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో మీ సోదరుడు గిరిబాబు వైఎస్సార్ సీపీ నుంచి పోటీ చేస్తే ఆయనపై మీరు పోటీ చేస్తారా అని ప్రశ్నించగా కుటుంబపరంగా అలా కుదరదని, ఒకవేళ పార్టీ ఆదేశిస్తే తప్పదని తెలిపారు.

ప్రజలు పరేషన్

- సమయపాలన పాటించని చౌకధరల దుకాణాలు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న కార్డుదారులు

గండేపల్లి: మండలంలోని చౌకధరల దుకాణాలు (రేషన్ షాపులు) సమయపాలన పాటించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ రేషన్ షాపులు తెరిచి ప్రజలకు సరకులు అందించాలి. కాగా మండలంలోని పలుచోట్ల సమయానికి రేషన్‌షాపులు తెరువకపోవడంతో సరకుల కోసం వచ్చిన ప్రజలు దుకాణాల వద్ద పడుగాపులు కాస్తున్నారు. మరికొన్ని చోట్ల తూకాల్లో తేడాలు వస్తున్నాయి. మల్లేపల్లి అన్నపురాజుపేటలోని రేషన్ షాపు ఉదయం 9.30 గంటలకు కూడా తెరవకపోవడంతో సరకులు కోసం వచ్చిన ప్రజలు ఇబ్బందుల పడ్డారు. కాగా 65 సంవత్సరాల వయస్సు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు డీలర్లు ఇంటికి వెళ్లి స్వయంగా రేషన్ సరుకులు పంపిణీ చేయాల్సి ఉంది. కొందరు డీలర్లు మీకు రేషన్ కావాలంటే షాపు వద్దకు రండి, సొమ్ములు కావాలంటే ఇప్పుడే ఇస్తామంటూ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి బేరాలు కుదుర్చుకుంటున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకూ రేషన్ షాపులు నిర్వహించాల్సి ఉండగా కొన్ని చోట్ల నిర్వహణ పూర్తిస్థాయిలో జరగడం లేదని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. రెవెన్యూ, సివిల్ సప్లయి శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటించని షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మల్లేపల్లిలో ఉదయం 9.30 గంటలకు కూడా తెరుకుకోని రేషన్ షాపు